క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన జోగినాయుడు



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సినీనటుడు, మాజీ కల్చరల్ కమిషన్ స్టేట్ క్రియేటివ్ హెడ్ జోగి నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం పులివెందుల్లో ఆయన కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. - నర్సీపట్నం

ఆర్టీసీ ఉత్తమ కండక్టర్‌గా సీతారామరాజు



రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామప్రసాదరెడ్డి నుంచి అవార్డు స్వీకరిస్తున్న సీతారామరాజు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం శివారు తెలకలదీపం గ్రామానికి చెందిన డెక్కల సీతారామరాజు ఆర్టీసీ ఉత్తమ కండక్టర్‌గా అవార్డు స్వీకరించారు. ఈ మేరకు ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర రవాణ శాఖ మంత్రి ఎం.రామప్రసాద రెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ దన్నుదొర చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. గత 17 సంవత్సరాలుగా విశాఖ సిటీలోని వాల్తేరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా సీతారామరాజు విధులు నిర్వహిస్తున్నారు. ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగడం, సాదరంగా పిలిచి బస్సు ఎక్కించుకోవడం, ఆర్టీసీ అధికారులు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయడం, తదితర కార్యక్రమాలు చేసినందుకు వాల్తేరు డిపోలో 350 మంది కండక్టర్లలో రాజు ఉత్తమ కండక్టర్ అవార్డు పొందడంపై స్థానికులు, యూనియన్ నాయకులు అభినందించారు.

78 మంది రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు



చంద్రయ్యపేట నుంచి బస్సు ద్వారా రోగులను తరలిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : కె.జె.పురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో మూడు బస్సుల ద్వారా 78 మంది రోగులను విశాఖ అనిల్‌నీరుకొండ ఆస్పత్రికి వివిధ శస్త్ర చికిత్సల కోసం తరలించారు. సొసైటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు ఆధ్వర్యంలో బుధవారం తెలిపారు. చీడికాడ మండలం శిరిజాం, ఖండివరం నుంచి బయలుదేరిన బస్సులో 25 మందిని కన్నూరు శ్రీరామూర్తి, శ్రీనాధు విజయ్ సారథ్యంలో బయలుదేరి వెళ్లారు. తురువోలు, చెట్టుపల్లి, చుక్కపల్లి గ్రామాల నుంచి 39 మందిని స్థానికులు పుట్టా మల్లికార్జునరావు, బి.వి.రమణ, పి.శ్రీనివాసరావు సారథ్యంలో, కె. కోటపాడు మండలం చంద్రయ్యపేట గ్రామం నుంచి 23 మంది రోగులను మాజీ ఎంపీపీ సబ్బవరపు రామునాయుడు, సూరిశెట్టి నారాయణ, ఆచారి మాస్టర్ సారథ్యంలో తరలించారు. వీరికి అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో వివిధ శస్త్ర చిక్సిత్సలు ఉచితంగా చేస్తారని సొసైటీ అధ్యక్షుడు రామకొండలరావు తెలిపారు.

200 ఎకరాలలో టమాటా సాగు



దాలివలసలో సాగులో ఉన్న టమాటా పంట

కె.కోటపాడు : మండలంలో టమాటా పంట సాగును రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేపడుతున్నారు. రెండు నెలల కాలవ్యవధిలోనే దిగుబడి ప్రారంభమయ్యే పంట కావడంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో కె.కె.అగ్రహారం, ఆర్లి, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, ఆర్లి, సూదివలస, దాలివలస, మర్రివలస, పాతవలస గ్రామాల్లో టమాటా సాగును రైతులు సుమారు 200 ఎకరాలలో సాగు చేస్తున్నారు. మెట్ట గ్రామాల్లో సాగులో ఉన్న టమాటా పంటకు ఇటీవల కురిసిన వర్షాలు మేలు చేయనున్నట్టు సాగు రైతులు తెలుపుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందడంలేదు. ప్రైవేటుకు దీటుగా విద్యనందించాలనే ఉద్దేశ్యంతో దివంగత నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఈ విద్యకు 11ఏళ్లుగా విద్యార్థులు దూరమయ్యారు. పాఠశాలల్లో కంప్యూటర్ విద్య అందించేందుకు నియమించిన ఫ్యాకల్టీలను తొలగించడమే దీనికి కారణం కాగా రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన కంప్యూటర్లు తుప్పుపట్టిపోయాయి.



మాకవరపాలెం హైస్కూల్‌కు అందించిన కంప్యూటర్లు ఫైల్)

- ప్రభుత్వ పాఠశాలల్లో అందని కంప్యూటర్ విద్య
- 11 ఏళ్ల క్రితం ఫ్యాకల్టీల తొలగింపు
- మూలనపడిన కంప్యూటర్లు
- పునఃప్రారంభించాలని విద్యార్థుల వినతి

షట్‌డౌన్ చేశారు... రీస్టార్ట్ అయ్యేనా ?

మాకవరపాలెం : యలమంచిలి డివిజన్ పరిధిలో 167 హైస్కూళ్లు ఉన్నాయి. వీటిలో మొదటి విడతగా 122, రెండో విడతగా 25 పాఠశాలలకు వై.ఎస్ ప్రభుత్వం 2008లో కంప్యూటర్లను అందజేసింది. ఒక్కో పాఠశాలకు 11 చొప్పున కంప్యూటర్లు, విద్యుత్ లేని సమయంలో ఈ విద్యకు ఆటంకం కలుగకుండా జనరేటర్‌ను కూడా మంజూరు చేసింది. ఒక్కో పాఠశాలకు థియరీ, ప్రాక్టికల్స్ బోధించేందుకు ఇద్దరు ఫ్యాకల్టీలను నియమించింది. కాంట్రాక్టు పద్ధతిలో వీరిని నియమించగా.. 2013తో గడువు ముగిసింది. అయితే తదుపరి ప్రభుత్వం వారిని తొలగించింది. ఫలితంగా అప్పటి నుంచి కంప్యూటర్ విద్యకు విద్యార్థులు దూరమయ్యారు.

మూలనపడ్డ కంప్యూటర్లు

కంప్యూటర్ విద్య అందించేందుకు నియమించిన ఫ్యాకల్టీలను తొలగించడంతో కంప్యూటర్లు మూలనపడ్డాయి. ఒక్కో ఫ్యాకల్టీకి అప్పట్లో నెలకు రూ. 3వేల చొప్పున చెల్లించేవారు. వారి కాంట్రాక్టు ముగియడంతో తొలగించిన కారణంగా గత 11 ఏళ్లుగా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందడం లేదు. ఈ ఫ్యాకల్టీలు కూడా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి కంప్యూటర్ విద్యను అందించాలని విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. దీంతో కొంతకాలం కొనసాగగా, నిత్యం వారి సబ్జెక్టులతో పాటు ఈ విద్యను బోధించేందుకు అవకాశం లేకుండాపోవడంతో ఈ బోధనపై వారు దృష్టి పెట్టలేదు. ఫలితంగా ప్రస్తుతం ఎంతో ప్రాముఖ్యం కలిగిన కంప్యూటర్ విద్యకు విద్యార్థులు దూరమయ్యారు. ఇక కంప్యూటర్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో కంప్యూటర్లు పాడైపోతున్నాయి. మరోవైపు విద్యుత్‌లేని సమయంలో ఆటంకం కలగకుండా ఉండేందుకు మంజూరు చేసిన జనరేటర్లు కూడా మూలనపడ్డాయి. కొత్త ప్రభుత్వమైనా కంప్యూటర్ విద్యను పునఃప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు.

కంప్యూటర్ విద్యను ప్రారంభించాలి



ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను మరలా ప్రారంభించాలి. ట్యాబ్‌లు, ఎల్‌సీడీలు, ఐఎఫ్‌పీలతోనే కాకుండా కంప్యూటర్ విద్య అందించడంపైనా అధికారులు, ప్రభుత్వం దృష్టి సారించాలి. - జి.గంగాభవాని, 9వ తరగతి విద్యార్థిని, మాకవరపాలెం హైస్కూల్

ప్రాముఖ్యతను గుర్తించాలి..



ప్రస్తుత కాలంలో కంప్యూటర్ విద్యకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. కానీ మాకు కంప్యూటర్ అంటే తెలియని పరిస్థితి ఉంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కంప్యూటర్ పరిజ్ఞానం అందించేందుకు చర్యలు చేపట్టాలి. - పిల్లా కిరణ్, విద్యార్థి, జీకోడూరు

రేపు విద్యుత్ చార్జీలపై పోరుబాట



ఎంపీపీ రాజారామ్



బాబూరావు

మాడుగుల : ఈ నెల 27వ తేదీన మాడుగుల సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ చార్జీలు తగ్గించాలని వినత పత్రం అందజేత కార్యక్రమం జరగనుందని, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజామ్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పెంచుతున్న విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ప్రజలు తరపున విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేత కార్యక్రమానికి మండలంలో గల 29 పంచాయతీల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ ఎంపీటీసీలు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు, ఉదయం 9 గంటలకు విధిగా హాజరు కావాలని రాజారామ్ కోరుతున్నారు.

దేవరాపల్లి : కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాటలో భాగంగా మాడుగుల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం చేపడుతున్న నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్త ఈర్లె అనురాధ సారథ్యంలో జరిగే నిరసన కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. భారీ ర్యాలీగా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకొని పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తారన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘననివాళి



కె.కోటపాడు : వాజ్‌పాయ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కోటాన, పైల అమ్మాజి

మాడుగుల : మాజీ ప్రధాని వాజ్‌పేయి 100 జయంతిని మాడుగుల పాత బస్టాండ్ ఆవరణలో బుధవారం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆర్. మహేష్, మండల వాసు, పుట్టా నానాజీ, శంకర్, డి. అప్పారావు, పి. నాగేంద్ర పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ జయంతి వేడుకను బుధవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తమరాన పాలెంలో బీజేపీ మాజీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు తమరాన పెదిరెడ్డి వెంకటరమణ, కార్యకర్తలతో కలసి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో స్వావలంబనకు పెద్దపీట వేసిన ఘనత వాజ్‌పేయికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమాలు రోలుగుంటలో ఆడారి గణేష్ పాత్రో, మద్దు నారాయణరావు, వడ్డిపలో గజ్జి సాంబశివరావు, బుచ్చింపేటలో మండలపార్టీ అధ్యక్షుడు కర్రి తమ్మునాయుడు ఆధ్వర్యంలో జరిగాయి.

కె.కోటపాడు : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం కె.కోటపాడులో నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు కొటాన ఈశ్వరరావు, పైల అమ్మాజీ ఆధ్వర్యంలో ఈ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రధానిగా వాజ్‌పేయి హయాంలో పీఎం సడక్ యోజన ద్వారా ప్రతి గ్రామానికి తారురోడ్లు అందుబాటులోకి వచ్చాయని కోటాన ఈశ్వరరావు అన్నారు. స్వర్ణ చతుర్భుజి పేరుతో హైవేల అభివృద్ధి జరిగిందని తెలిపారు. బీజేపీ నాయకులు శరగడం సన్యాసినాయుడు, జనపరెడ్డి సూర్యనారాయణ, ఎరుకునాయుడు పాల్గొన్నారు.

సందడిగా క్రిస్మస్ పండగ



చోడవరం గాంధీగ్రామంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కరణం ధర్మశ్రీ



ఖండివరం చర్చిలో ప్రార్థనలు



ఎ.కోడూరు చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ డాక్టర్ శేఖర్



రోలుగుంట ఆర్సీఎం చర్చిలో సువార్త చదివి వినిపిస్తున్న ఫాదర్ అజయ్



కొండలఅగ్రహారంలో ప్రసంగిస్తున్న జీవన్‌రాయ్

చోడవరం : ఒక పక్క ప్రార్థనలు మరో పక్క కేకులు కట్ చేసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపారు. బుధవారం ఉదయం నుంచి చర్చిల వద్ద క్రైస్తవ మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్టార్స్, ప్రత్యేక విద్యుత్ అలంకరణతో ముస్తాబైన చర్చిల వద్ద సామూహిక ప్రార్థనలు, సామూహిక భోజనాలు చేశారు. మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గ్రాంధీ గ్రామం ఆర్‌సీఎం చర్చితోపాటు వెంకన్నపాలెం చర్చి, చోడవరం ద్వారకానగర్ ఇమ్మానియల్ చర్చి, యడ్లవీధి జాన్‌మాస్టర్ బాప్టిస్ట్ చర్చి, న్యూ శాంతినగర్‌లో జోయ్ ఆఫ్ పీస్ మినిస్ట్రీ చర్చి, గోవాడ, అంబేరుపురం, లక్కవరం, జి.జగన్నాథపురం, గౌరీపట్నం, గంధవరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జోయ్ ఆఫ్ పీస్ మినిస్ట్రీ సిస్టర్స్, ద్వారకానగర్ ఇమ్మానియల్ చర్చిలో పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గోవిందమ్మ కాలనీలో క్రిస్మస్ వేడుకల్లో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. లక్కవరం చర్చిలోనూ యువకులు కేకులు కట్ చేసి సంతోషంగా కేరింతలు కొట్టారు. పాస్టర్ డానియల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గోవాడ చర్చిలో పాస్టర్ అనంతరావు, అన్నవరం చర్చిలో పాస్టర్ డి.కిరణ్ ప్రార్థనలు చేశారు.

చోడవరం రూరల్: క్రిస్మస్ సందర్భంగా క్రీస్తు దేవాలయాలను అందంగా అలంకరించి, రంగు,రంగుల విద్యుద్దీపాలంకరణలు చేయడంతో ఆకర్షణీయంగా మారాయి. తెల్లవార్లూ క్రీస్తు దేవుని భక్తి గీతాలు, ప్రార్థనలతో చర్చిలన్నీ మారు మోగాయి. బుధవారం క్రీస్తు నామమున చర్చిల ఫాస్టర్లు కేక్ కటింగ్ చేసి, పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొని కేక్, స్వీట్లు పంచిపెట్టారు. పలు గ్రామాల్లో ఊరేగింపులు జరిపి అందరికీ శుభాకాంక్షలు తెలియచేశారు.

మాడుగుల : స్థానిక ఆర్‌సీఎం చర్చిల్లో బుధవారం క్రిస్మస్ పండగ సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. ఎం. కోడూరు, మాడుగుల, వొమ్మలి, తాటిపర్తి, శంకరం, తదితర గ్రామాల నుంచి విశ్వాసులు వచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. మండలంలో సత్యవరం, గాదిరాయి, కింతలి, తాటిపర్తి, ఎం.కోడూరు గ్రామాలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కేజేపురంలో పేదలకు చీరలు పంపిణీ

మాడుగుల రూరల్: క్రిస్మస్ వేడుకలు గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ఉదయం నుంచి పార్థనలు నిర్వహించారు. కె.జె.పురం కాలనీలో గల ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ డి.జోసఫ్ ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు జననం, ఆయన బోధనల గురించి భక్తులకు వివరించారు. కేక్ కట్ చేశారు. 50 మంది నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ శామ్యూల్‌తో పాటు నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ బుడబండి రాజు, బి.శ్రీకాంత్, అప్పారావు పాల్గొన్నారు. ముకుందపురం, వీరవల్లి అగ్రహారం, ఎం.కోడూరు, తాటిపర్తి, బిళ్లలపాలెం, గాదిరాయి, జె.డి.పేట, వంటర్లపాలెం గ్రామాల్లో గల చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

చీడికాడ : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి నుంచే నగర సంకీర్తనలు జరిపి వేడుకలను ప్రారంభించారు. ఏ చర్చిలో చూసినా ఉదయం నుంచి క్రైస్తవులతో నిండిపోయాయి. ప్రార్థనలు, సువార్తలతో బైబిల్ గ్రంథంలో గల వాక్యాలను చదవి క్రీస్తును ప్రార్థించారు. దీంతో అన్ని చర్చిల వద్ద సందడి నెలకొంది.

దేవరాపల్లి : కాశీపురం సియోను ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో నిస్సీ మినిస్ట్రీస్ డైరక్టర్ బిషప్ డా. గొర్లి గైటస్, గ్రేస్ దంపతులు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రిస్మస్ ఆరాధన, కీర్తనలను ఆలపించారు. ప్రేమ, కరుణ, దాతృత్వం, శాంతి, సహనం కలిగి ఉండాలన్నదే ఏసు క్రీస్తు మానవళికి అందించిన గొప్ప సందేశం అని పేర్కొన్నారు. క్రిస్మస్ కేక్‌ను బిషప్ టైటస్, గ్రేస్ దంపతులు, దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ తదితరులతో కలిసి కట్ చేశారు. హ్యాపీ హ్యాపీ క్రిస్మస్ అంటూ నినదించారు.

రోలుగుంట: మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో మత స్థులకు ఫాదర్ అజయ్ సువార్త చదివి వినిపించారు. అనంతరం క్రీస్తును స్మరిస్తూ ఆయన పేరున సర్వేశ్వరా మమ్ము మన్నించు, ఆశీర్వదించూ ,మంచి భవిష్యత్ ప్రసాదించు అంటూ ప్రార్థనలు చేసుకున్నారు. ప్రార్థనానంతరం క్రైస్తవ సోదరులు తమ ఇళ్లకు వచ్చి ఆహ్వానించిన స్నేహితులు, బంధువులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు.

గొలుగొండ : క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏఎల్‌పురం, గొలుగొండ, జోగుంపేట, ఏటిగైరంపేట, కొత్తమల్లంపేట, కృష్ణదేవిపేట తదితర గ్రామాల్లో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. చర్చిలో ప్రార్థనలు అనంతరం అక్కడ వచ్చిన క్రైస్తవ సోదరులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

కె.కోటపాడు : మండల గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ భక్తులు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో గల క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలను చర్చ్ ఫాదర్‌లు నిర్వహించారు. కె.కోటపాడులో గల యు.ఈ చర్చ్‌లో రెవరెండ్ ప్రేమ్ కుమార్ మహంతి, చంద్రయ్యపేటలో పాస్టర్ దేవకుమార్, వారాడ, వి.సంతపాలెం, కొత్త అగ్రహారం గ్రామాల్లో గల సార్వత్రిక క్రీస్తు సంఘంలో రెవరెండ్ ఎస్.మోజేష్, ఎ.కోడూరు క్రియేటర్ వర్షిప్ చర్చ్‌లు డాక్టర్ శేఖర్, బ్రదర్ రాజు, శైలేష్, చౌడువాడలో ఆంధ్రాబాపిస్ట్, ఆనందపురంలో ప్రేమ సముద్రం, శ్రీనివాస్, పాతవలసలో పాస్టర్ సువార్తరాజు ఆధ్వర్యంలో ఆయా చర్చ్‌లలో ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులు ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొని ఆనందోత్సాహాల నడుమ క్రిస్మస్ వేడుకలను జరుపుకొన్నారు.

బుచ్చెయ్యపేట : క్రిస్మస్ పండగ సందర్భంగా మండలంలో పలు చర్చిల్లో బుధవారం ఉదయం నుంచి పార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు జననం, ఆయన బోధనలు, గురించి చర్చిలల్లో పాస్టర్లకు వివరించారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, రాజాం, విఆర్‌ఆర్‌పేట, దిబ్బిడి, గున్నెంపూడి, ఎల్.బి.పురం , బంగారుమెట్ట, పోట్టిదొరపాలెం, తదితర గ్రామాల్లో గల చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు.

మాకవరపాలెం : మండలంలోని అన్ని చర్చిల్లో బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికి ఒకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కొండలఅగ్రహారం ఇమ్మానుయేలు చర్చిలో బిషప్ కె.జీవన్‌రాయ్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అందరినీ ప్రేమతో ఆదరించాలని, అదే క్రీస్తు సందేశమన్నారు. పెంతుకొస్తు ప్రార్థనామందిరాల్లో రెవరెండ్ టి.వి.రత్నం, పాస్టర్‌లు విక్టర్‌పాల్, వి.పాల్, కిరణబాబు క్రిస్మస్ విశిష్టతను వివరించారు.



కె.జె.పురం కాలనీలోని ప్రార్థనా మందిరంలో ఏసు బోధనలు వినిపిస్తున్న పాస్టర్ జోసఫ్



కాశీపురం చర్చిలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న బిషప్ గొర్లె టైటస్, గ్రేస్ దంపతులు, సర్పంచ్ పెంటమ్మ



ఏఎల్‌పురంలో క్రైస్తవ సోదరులను ఉద్దేశించి మాట్లాడుతున్న చర్చి పాస్టర్



ఆనందపురం చర్చిలో క్రీస్తు బోధనలు వివరిస్తున్న పాస్టర్ ప్రేమ సముద్రం

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు



రొంగలినాయుడుపాలెంలో వేకువజాము సమయాల్లో మేలుకొలుపు కార్యక్రమం

కె.కోటపాడు : ధనుర్మాసం పర్వదినాలు కావడంతో గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు. కె.కోటపాడు, గొందుపాలెం, చౌడువాడ, రొంగలినాయుడుపాలెం గ్రామాల్లో భక్తులు ఉదయం వేళల్లో ఈ మేలుకొలుపు కార్యక్రమాన్ని జరుపుతున్నారు. ఆయా గ్రామాల్లో ప్రధాన రామాలయాలలో ప్రతి రోజూ విశిష్ట పూజలను జరిపి ఆయా గ్రామాల్లో గల ప్రధాన వీధుల్లో భజన కార్యక్రమాలను చేపడుతున్నారు. ఉదయం వేళల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం కలగనున్నట్టు పేర్కొంటున్నారు. రొంగలినాయుడుపాలెంలో నిర్వహిస్తున్న మేలుకొలుపు కార్యక్రమాల్లో సర్పంచ్ పైల పైడితల్లమ్మ, కోటేశ్వరరావు, ఎంపీటీసీ గొర్రుపోటు రామలక్ష్మి, రొంగలి నారాయణరావు, చుక్కల మోహన్‌రావు, సాయి సందీప్ శర్మ, పైల నాగమణి, పల్లా అర్జునమ్మ పాల్గొన్నారు.

ఆరుగాలం కష్టం వర్షార్పణం

- కోయకుండా వదిలేసిన చేనులో రాలిపోతున్న ధాన్యం
- దిక్కుతోచని స్థితిలో ఖరీఫ్ వరి రైతులు



పొలాల్లో పనలపై మొలకెత్తుతున్న ధాన్యం

నాతవరం : ఎంతో కష్టపడి పెట్టుబడి పెట్టి పండించిన వరి పంట చేతికంది వచ్చే సమయంలో రైతన్నలపై ప్రకృతి కన్నెర్ర చేయడంతో అయోమయంలో ఉన్నారు. జిల్లాలోనే ఖరీఫ్ సీజన్‌లో వరి పంట నాతవరం మండలంలోనే అధికంగా రైతులు సాగు చేశారు. సగానికి పైగా రైతులు వరి చేను కోసేసి కుప్పలు పెట్టుకోకుండా పంట భూమిలోనే పనలపై వదిలేశారు. కొంత మంది రైతులు పండేసిన వరి చేను కోతలు చేయకుండా వదిలేశారు. కోసేసిన వరి చేను పనలపై ధాన్యం మొలకెత్తగా కోయకుండా వదిలేసిన వరి చేను పండిపోయి ధాన్యం గింజలు పంట భూమిలోనే రాలిపోతున్నాయి. గత ప్రభుత్వంలో రైతులకు రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం అందించి ఓ మోస్తరు ఆర్థిక భరోసా కల్పించింది. కూటమి ప్రభుత్వం రైతులకు ఇంత వరకు ఎలాంటి ప్రయోజనం కలిగే పనులు చేయడం లేదని రైతులు అంటున్నారు.